క్లుప్తంగా

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి


ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన కిషోర్‌బాబు

చౌడేపల్లి: చౌడేపల్లెలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని లోకసభ ప్యానల్ స్పీకర్, ఎంపీ మిథున్‌రెడ్డిని కోరుతూ చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలో ఎంపీని ఆయన కలిశారు. మండలం నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పుంగనూరు, పలమనేరు, మదనపల్లె ప్రాంతాల్లో డిగ్రీ కళాశాలలకు వెళ్తున్నారన్నారు. ఇక్కడే కళాశాల ఏర్పాటు చేస్తే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని నివేదించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ అరుణమ్మ

రొంపిచెర్ల: మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన గోవిందమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియల నిమిత్తం మృతురాలి కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా రూ.10 వేలను సర్పంచ్ చిచ్చిలి అరుణమ్మ అందజేశారు. వైఎస్సార్ బీమా చేసుకుంటే అనారోగ్యం లేదా ప్రమాదవశాత్తుగానీ మృతి చెందితే వారికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేస్తుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు శివగణేష్, తారకనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటపై అవగాహన



పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ గొల్లపల్లెలో మంగళవారం జిల్లా ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు శారదా జయలక్ష్మి, రెడ్డిరాము, రాఘవేంద్ర రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణ కోసం రైతన్నలు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వారు వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఏఓ సంధ్య, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లె సమీపంలోని గాండ్లవంక వద్ద సారా విక్రయిస్తున్న బురుజుపల్లెకు చెందిన చిన్నోడమ్మ(69), విజయశాంతి(36)లను అరెస్ట్ చేసి వారి నుంచి 120 ప్యాకెట్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు మంగళవారం తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ దేవరాజులు పాల్గొన్నారు.


పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని నిడిగుంట సమీపంలోని పొలాల వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట శిబిరంపై సిబ్బందితో కలసి ఎస్‌ఐ దాడి చేశారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ 31,000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కోడి పందెం రాయుళ్లు..

పెద్దపంజాణి: మండలంలోని కొత్తబూరగపల్లె సమీపంలోని నెట్టుబండ వద్ద కోడి పందేలు ఆడుతున్న వారిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. అందిన రహస్య సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో కోడిపందేల స్థావరంపై దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని 50,100 రూపాయలు, 4 కోళ్లు, పందెం కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరపరచడంతోపాటు కోళ్లను కోర్టులో బహిరంగ వేలం వేయాల్సి ఉంది.

గుండెపోటుతో సింగపూర్‌లో మృతి


శ్రీనివాసులు (ఫైల్)

సోమల: సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న మండలానికి చెందిన ఓ అల్లుడు గుండెపోటుకు గురై మరణించినట్లు ఆలస్యంగా తెలిసింది. వివరాలు.. తిరుపతికి చెందిన మారిశెట్టి శ్రీనివాసులు సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతనికి మండలంలోని గుంతచెరువుపల్లెకు చెందిన ఎల్‌ఐసీ శంకర కుమార్తె హేమలతతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె సంతానం. గత నెల 29న శనివారం సింగపూర్‌లో అతను గుండెపోటుకు గురై మరణించాడు. బుధవారం సింగపూర్ నుంచి అతడి మృతదేహం గుంతచెరువుపల్లెకు తీసుకువచ్చి అంతక్రియలు చేయనున్నట్టు గ్రామస్తుల ద్వారా తెలిసింది. శ్రీనివాసులు స్థానికంగా భూములు కొని ఉండడంతో ఆ ప్రాంతంలో అంత్యక్రియలు చేయనున్నట్టు తెలుస్తోంది.

సుందర పట్టణంగా పుంగనూరు

- రూ.71 కోట్లతో పనులు
- ఎంబీటి రోడ్డు విస్తరణ
- మంత్రి, ఎంపీ చొరవతో మహర్దశ


పుంగనూరులో విస్తరించనున్న ఎంబీటి రోడ్డు


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)

పుంగనూరు: 30 ఏళ్ల పుంగనూరు పట్టణాన్ని ఒకే కుటుంబం పాలించినా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉండేది. రాజకీయ ఎదుగుదలకు సోపానంగా పుంగనూరును ఆ కుటుంబం మార్చుకోవడం తప్పితే అభివృద్ధిని విస్మరించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి పట్టణానికి మహర్దశ ప్రాప్తించింది. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి విరివిగా నిధులు మంజూరు చేసి పుంగనూరు అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. పట్టణ సుందరీకరణకు శ్రీకారం చుట్టారు.

విలీనంతో పెరిగిన పట్టణ విస్తీర్ణం

పట్టణంలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నారు. ఇక్కడ ఓటర్లు 40,720 మందితో 31 వార్డులున్నాయి. 33 మురికివాడలు, 197 వీధులతో సుమారు 16.06 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో పట్టణం ఉంది. మంత్రి పట్టణ పరిధిని పెంచారు. ఇందులో 16 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఎంబీటి రోడ్డులోని రాంపల్లె, మంగళం కాలనీ, నక్కబండ ప్రాంతాలను మున్సిపాలిటిలో విలీనం చేశారు.

రూ.41కోట్లు విడుదల

పట్టణ సమీపంలోని భీమగానిపల్లె జాతీయ రహదారి నుంచి చిత్తూరు వైపు గల గుడిసెబండ వరకు 10.35 కిలోమీటర్ల రోడ్డును రూ.41 కోట్లతో అభివృద్ధి చేయడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం భూమిపూజ చేయడం విదితమే. ఎంబీటి రోడ్డు ప్రస్తుతం 7 మీటర్ల వెడల్పుతో ఉంది. దీనిని 10 మీటర్ల రోడ్డుగా విస్తరించి, రోడ్డు మధ్యలో డివైడర్లు, రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు, వాటిపై పాదచారులు నడిచే విధంగా నిర్మించనున్నారు. రహదారి మధ్యలో 8 వంతెనలు నిర్మించడంతోపాటు ఎల్ఈడీ దీపాలు, కూడలి ప్రాంతాలలో దీపాలు, రహదారి సూచికలు ఏర్పాటు చేయనున్నారు.మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఇదలా ఉంచితే, ఆరు నెలల క్రితం కోర్టు రోడ్డును సుమారు రూ.4 కోట్లతో సుందరీకరించారు. పట్టణంలో బైపాస్ రోడ్డు, గ్రామ సరిహద్దులో బైపాస్ రోడ్డు వేయడంతో భూముల ధరలు పెరిగి రైతులు కోటీశ్వరులయ్యారు.

రూ. 4 కోట్లతో పార్కు

పట్టణ ప్రజలకు ఆటవిడుపు కోసం రూ.4కోట్లతో పార్కు పనులకు ఉపక్రమించారు. పుంగమ్మ చెరువు కట్టపై నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు ప్రత్యేకమైన రహదారి ఏర్పాటు చేసి మొక్కలు, లైట్లు , బెంచీలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే కట్టనూ విస్తరిస్తారు.

'కౌండిన్య' లైనింగ్‌కు రూ.22 కోట్లు

పట్టణంలోని కౌండిన్య నది కాలువలు రెండు పాయలుగా ఉంది. ప్రస్తుతం మార్క్సునగర్, రాయలచెరువు, ఎంఎస్ఆర్ రోడ్డు నుంచి తూర్పుపాళ్యం మీదుగా ఉన్న కౌండిన్యనది కాలువలు 6,280 మీటర్ల పొడవు ఉన్నాయి. ప్రస్తుతం ఆ కాలువల్లో ఉన్న మురుగునీటిని తొలగించి, పూర్తిగా సిమెంటు లైనింగ్ పనులకు మంత్రి రూ.22 కోట్లు విడుదల చేశారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి.



ప్రజలను మరువలేం

మా కుటుంబానికి ఎన్నో పదవులు అందిస్తున్న పుంగనూరు ప్రజల రుణం తీర్చుకోలేం. కష్టసుఖాల్లో తోడుగా ఉన్న ప్రజలందరికీ మా కృతజ్ఞతలు. ప్రజలకు, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది, రాష్ట్రంలో గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు రూపకల్పన చేశాం. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం.

– మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నాలుగేళ్లలో అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి, ఎంపీ పుంగనూరుకు కోట్లాది రూపాయలు విడుదల చేసి అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. బైపాస్ రోడ్లు, విస్తరణ, పార్కు ఏర్పాటు పనులు శుభపరిణామం, మూడు దశాబ్దాలుగా జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసిన పెద్దిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉన్నాం.

– డాక్టర్ శరణ్‌కుమార్, రోటరీక్లబ్ అధ్యక్షుడు, పుంగనూరు

మీరు చేసిన మోసాలే మీకు పాపాలు


గడప గడపకు మనప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: "అన్నా! నాడు ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జనానికి లేనిపోని ఆశలు పెట్టి, మీరు చేసిన మోసాలే ఇప్పుడు మీకు శాపాలుగా మారాయి..మూడు దశాబ్దాలుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నా మీరు ఇక్కడ ఏం అభివృద్ధి చేశారో జనానికి చెప్పాలి" అని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ మాజీ మంత్రి అమరనాథ రెడ్డికి సవాల్ విసిరారు. స్థానిక మున్సిపాలిటీలోని 22వ వార్డులో బోయవీధి, కంసల వీధి, నాగులురాళ్ల వీధి, బట్టివీధుల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 490 గృహాలను ఆయన సందర్శించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. అక్కడికక్కడే 90శాతం సమస్యలను పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఇక్కడ ఓ పరిశ్రమనైనా తెచ్చారా? స్థానికంగా ఒకరికైనా ఉపాధి కల్పించారా? అని సూటిగా మాజీ మంత్రిని ఉద్దేశించి ప్రశ్నించారు. ఇప్పటికే మాజీ మంత్రి తనకు ఉన్న 300 ఎకరాలతో పాటు నాలుగు రోడ్లు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కోట్లాది రూపాయల భూమిని లక్షల రూపాయకే కాజేశారని ఆరోపించారు. ఏసియా బ్యాంకు ద్వారా మాజీ మంత్రి అమరనాథ రెడ్డి తన మనుషులకు రోడ్డు కాంట్రాక్టులు ఇప్పించి, వాటికి 30 శాతం కాంట్రిబ్యూషన్ కట్టకపోవడంతో నిధులు రాకుండా పోయాయని మండిపడ్డారు. దమ్ముంటే దీనిపై కాణిపాకంలో ప్రమాణానికి రావాలని సవాల్ విసిరారు. తాను తప్పు చేసి ఉంటే వచ్చే ఎన్నికల్లో జనం తనకు, మీరు దగా చేసి ఉంటే మీకు (అమరనాథరెడ్డి) బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, వైస్ చెర్మన్లు చాన్బా కమాల్, కిరణ్ కుమార్, పట్టణ కన్వీనర్ జాఫర్, రేష్మ, కోదండరామయ్య, పలువురు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

గంగవరం: మండలంలోని తాళ్లపల్లె, చిన్నూరు గ్రామాల్లో నూతనంగా గ్రామ సచివాలయాలను ఎమ్మెల్యే వెంకటేగౌడ మంగళవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ. 40 లక్షలతో నిర్మించారు. ఆయన మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, తాళ్లపల్లె, గంగవరం సర్పంచు శంకరమ్మ, చంద్రమ్మ, ఎంపీటీసీలు భారతి, లేఖ్య, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, మల్లిరెడ్డి, రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబు, మంజు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

జిప్సం వేస్తే అధిక దిగుబడి


వేరుశనగ దిగుబడిపై అవగాహన కల్పిస్తున్న వెంకటరమణ నాయక్

రొంపిచెర్ల: వేరుశనగ సాగులో జిప్సం వేస్తే అధిక దిగుబడి పొందవచ్చని రొంపిచెర్ల–2 రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్ అన్నారు. మంగళవారం బోడిపాటివారిపల్లెలో వైఎస్సార్ రైతు పొలం బడి కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఎకరాకు రెండు బస్తాల జిప్సం వేయాలన్నారు. దీని వలన వేరుశనగ కాయలు నాణ్యతతో ఉంటాయన్నారు. వేరుశనగ విత్తనాలు వేసే ముందు దుక్కిలో 100 కిలోల చొప్పున జిప్సం వేయాలని, అలాగే పూత దశలో 100 కిలోల జిప్సం వేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల ప్రకారం పంట సాగు చేస్తే ఎకరాకు 20 బస్తాల తక్కువ కాకుండా దిగుబడి సాధించవచ్చున్నారు.

డిజిటల్ తరగతి గదులు ప్రారంభం


డిజిటల్ క్లాస్ రూమ్స్‌ను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ

వి.కోట: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివద్ధే లక్ష్యంగా సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన చేయడానికి వీలుగా డిజిటల్ తరగతి గదులకు శ్రీకారం చుట్టిందని వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్ అన్నారు. మంగళవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్స్‌ను ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఒక్కో డిజిటల్ బోర్డు రూ.1.5 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్.నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి 6 బస్సులు

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసి డిపో నుంచి తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకి ప్రతి పౌర్ణమికి ఆరు బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. మంగళవారం ఆర్టీసీ వైఎస్సార్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డితో కలసి బస్సులను ప్రారంభించి మాట్లాడారు. ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సంధ్య, యూనియన్ నాయకులు కరీముల్లా, గౌరిశంకర్, మల్లేశ్వర్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

పలమనేరు: 1 నుంచి 5వ తరగతులకు ఈ నెల 4 నుంచి నిర్వహించనున్న అసెస్‌మెంట్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ఆదేశించారు. మంగళవారం మండలంలోని నక్కపల్లె, మొరం పాఠశాలలను వారు తనిఖీ చేశారు. అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన విధి విధానాలను వారు సంబంధిత హెచ్‌ఎంలకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాలల సీఆర్పీలు పాల్గొన్నారు.


ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిదర్శనం సీఐ

- బదిలీ వీడ్కోలు సన్మానంలో వక్తలు


సీఐ మధుసూదనరెడ్డిని సన్మానిస్తున్న పెద్దిరెడ్డి, నేతలు, అధికారులు

చౌడేపల్లి: ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిదర్శనంగా సీఐ మధుసూదనరెడ్డి నిలిచారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. పుంగనూరు రూరల్ సీఐ మధుసూదనరెడ్డి రైల్వేకోడూరుకు బదిలీ అయ్యారు.దీ నేపథ్యంలో మంగళవారం చౌడేపల్లె సర్కిల్ కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు సన్మానం చేశారు. నాలుగేళ్లుగా ఆయన సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణలో ఆయన చేసిన సేవలను పలువురు ప్రస్తుతించారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఇదే తీరులో అందరి మన్ననలు అందుకోవాలని ఆకాంక్షించారు. సర్కిల్ పరిధిలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు సీఐను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దామోదరరాజు, సోముశేఖర్‌రెడ్డి, జానపద కళల రాష్ట్ర చైర్మన్ కొండవీటి నాగభూషణం, పికెఎం వుడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆలీం బాషా, మాజీ చైర్మన్ షరీఫ్, అమ్ము, ఎంపీపీలు రామమూర్తి, అక్కిసానిభాస్కర్‌రెడ్డి, యల్లప్ప, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీలు రెడ్డిప్రకాష్, అంజిబాబు, రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎస్‌ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

మరింత సేవలతో మన్ననలు పొందండి


సమావేశంలో మాట్లాడుతున్న జార్జి

శాంతిపురం: ప్రజలకు మరింత సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా గణాంక అధికారి జార్జి పిలుపునిచ్చారు. ఆశా డే సందర్భంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తల్లిపాల వారోత్సవాలు, నులి పురుగుల నివారణ, మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాల్లో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు మరింత చురుగ్గా పాల్గొనాలన్నారు. ఈ–ఆశా, యు–విన్ యాప్‌లలో పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గుణశేఖర్, డీఎంఎంఓ కృష్ణ, సీహెచ్ఓ లతీఫ్ ఖాన్, సూపర్‌వైజర్లు కోదండపాణి, శశికళ పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతంతో సమానం


రొంపిచెర్ల : తల్లి పాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రొంపిచెర్ల: తల్లి పాలు అమృతంతో సమానమని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. 7వ తేదీ వరకు నిర్వహించనున్న తల్లి పాల వారోత్సవాలపై మంగళవారం ఆయన తమ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించడం వలన శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. ముర్రు పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, తల్లి పాలను రెండేళ్లపాటు ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఆరోగ్య,, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలే మొదటి టీకా

సదుం: తల్లిపాలే బిడ్డకు అందించే మొదటి టీకా అని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీష పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆశా డే నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 7వ తేదీ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తల్లి పాలు సులువుగా జీర్ణం అవుతాయని చెప్పారు. కాన్పుల కోసం ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సీహెచ్‌సీ డాక్టర్లు పుష్పకుమారి, అనురాధ విజ్ఞప్తి చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ నీలకంఠ, ఉదయభాస్కర్, జానకి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ


సోమల: పింఛన్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు


రుయాలో రోగికి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ శశికుమార్

సోమల: స్థానిక కొత్తపేట వీధిలో సింగిల్ విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, బజారు వీధిలో ఎంపీటీసీ సభ్యురాలు సావిత్రమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మునాఫ్ సాహెబ్, దళితవాడలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొగిళప్పగారి శ్రీనివాసులు, దర్గా వీధిలో మండల కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్ సాహెబ్ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఐలా సురేంద్ర, వైఎస్సార్ సీపీ నేతలు చక్రపాణి, వీవీ రమణ, ఆటో మునిరాజ పాల్గొన్నారు.

సదుంలో..


సదుం: మండలంలో మంగళవారం వేకువ జామునుంచే సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు పింఛన్ అందజేశారు. ఉదయాన్నే పింఛన్ అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

రుయా ఆస్పత్రికి వెళ్లి పెన్షన్..


సదుం: అమ్మగారిపల్లెలో..

రొంపిచెర్ల: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి వలంటీర్ పెన్షన్ అందజేశారు. వివరాలు.. మండలంలోని బోడిపాటివారిపల్లెకు చెందిన గ్రీన్ అంబాసిండర్ వెంకటయ్య అనారోగ్యంతో తిరుపతి రుయా ఆస్పత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఇది తెలుసుకున్న వలంటీర్ శశికుమార్ తిరుపతి రుయా ఆస్పత్రికి మంగళవారం వెళ్లి పెన్షన్ అందజేశారు. వలంటీర్‌ను పలువురు అభినందించారు.

భక్తిప్రపత్తులతో పౌర్ణమి పూజలు


బైరెడ్డిపల్లె : గరుడవాహనంపై కళ్యాణ వెంకటరమణస్వామి


తమలపాకుల అలంకరణలో వీరాంజనేయస్వామి


అలంకరణలో కాశీవిశ్వనాథుడు


ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాంబ

బైరెడ్డిపల్లె: పౌర్ణమి పురస్కరించుకుని మంగళవారం మండలంలోని పట్నపల్లె శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామి వారిని కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాల వితరణ చేశారు. అలాగే కుప్పనపల్లె సమీపంలోని శ్రీకాళభైరవేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

వి.కోటలో..

వి.కోట: పౌర్ణమి పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తిప్రపత్తులతో పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి తమలపాకుల మాలలు కట్టి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

రామకుప్పంలో ..

రామకుప్పం: స్థానిక అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు. హర హర మహాదేవ నామస్మరణ నడుమ పౌర్ణమి జ్యోతిని ఆలయ నిర్వాహకులు వెలిగించారు. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

చామనేరులో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణ ప్రజలకు ఇళ్ల ముంగిటే వైద్య సేవలు అందిస్తున్నామని పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి. మురళి అన్నారు. మంగళవారం చామనేరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.